శుక్ర వారం
29-12-2023
సంపుటి - 08,
సంచిక - 418
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# తెలంగాణలో ప్రజాపాలన సందడి

ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తుల స్వీకరణ • మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కార్యక్రమంలో

తమది దొరల ప్రభుత్వంకాదన్న డిప్యూటీ సిఎం భట్టి • ప్రజా ప్రభుత్వంగా పనులు నెరవేరుస్తామన్న దామోదర



**హైదరాబాద్, డిసెంబర్ 2(సమ సమాజం):** మొదలయ్యింది. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపుర్ మెట్‌లో 6 గ్యారెంటీలకు సంబంధించి 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ప్రజలెవరకూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, ఇది దొరల ప్రభుత్వం కాదని ప్రజల ప్రభుత్వమని అన్నారు. మా పార్టీలోకి వస్తేనే ఇల్లు ఇస్తామని, పథకాలు అందిస్తామనే ప్రభుత్వం తమది కాదని చెప్పారు. 'పదేళ్లలో రాష్ట్ర ప్రజలు నీళ్లు, నిధులు, నియామకాలు పొందలేదు. ప్రజల చేత ప్రజల కోసం వచ్చిన ప్రభుత్వం మాది. ప్రజాపాలన అందిస్తామని చెప్పి ఒప్పించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. మేం ఇచ్చిన 6 గ్యారెంటీలను ప్రజల సమక్షంలోనే అమలు చేస్తున్నామని వివించారు. ప్రజల వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి వంద కుటుంబాలకు ఓ కౌంటర్ పెట్టి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఈ రాష్ట్ర సంపదను ప్రజలకు అందిస్తాం. ప్రతి ఊరిలోనూ కౌంటర్ ఉంటుంది. జనవరి 6 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని భట్టి వెల్లడించారు. మనది ప్రజల ప్రభుత్వమని దొరల ప్రభుత్వం కాదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజల దగ్గరకే వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, తాను పాదయాత్ర చేస్తున్న సమయంలో మహిళలు వారి సమస్యలు చెప్పుకున్నారని, ప్రజల చేత ప్రజల కోసం వచ్చిన ప్రభుత్వం మనదన్నారు. తొమ్మిదేళ్లలో ఒక రేషన్ కార్డుకు దరఖాస్తు తీసుకోలేదని, ప్రజాపాలన అందిస్తామని చెప్పి ప్రజలను ఒప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేశామని, తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజల సమక్షంలో అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. పదేళ్లలో రాష్ట్ర ప్రజలు నీళ్లు, నిధులు, నియామకాలు పొందలేదన్నారు. ప్రజలు దగ్గరకు వెళ్లి ఆరు గ్యారెంటీలు అమలు చేయడానికి చేస్తున్న కార్యక్రమమే ప్రజాపాలన అని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఎంఎల్ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ గౌతమ్, తదితరలు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమైంది. అభయహస్తం గ్యారంటీల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలో కార్యక్రమాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు. మెదక్ జిల్లాలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తుందన్నారు. ప్రభుత్వం మీ ముందు వచ్చిందని... మీ దరఖాస్తులు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వాలు అంటే ప్రజలు నిర్ణయించి అధికారం ఇస్తారన్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## ఆర్టీసీ సిబ్బందిపై దాడి సరికాదు

ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్



**హైదరాబాద్, డిసెంబర్ 2(సమ సమాజం):** ఆర్టీసీ సిబ్బందిపై ప్రయాణికులు దాడులు చేయడం సరికాదని టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. మహాలక్ష్మి స్కీమ్ అమల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్టీసీ సిబ్బందిని దూషించడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలను ఆర్టీసీ యాజమాన్యం ఏ మాత్రం సహించదు అని స్పష్టం చేశారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ఈ ఘటనపై ఆయా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సజ్జనార్ పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సహకరించాలని కోరుతున్నట్లు సజ్జనార్ పేర్కొన్నారు.

## సైబరాబాద్ పరిధిలో ఇద్దరు సిఐల సస్పెన్షన్

విధి నిర్వహణలో అలసత్వంపై సిపి చర్య



**, డిసెంబర్ 2(సమ సమాజం):** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలను సీపీ అవినాశ్ మహంతి సస్పెండ్ చేశారు.. కేపీ హెచ్ బీ సీఐ వెంకట్, ఎయిర్ పోర్ట్ సీఐ శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భార్యాభర్తల మధ్య వివాదంలో జోక్యం చేసుకుని ఓ వ్యక్తిని చితకబాదిన కేసులో సీఐ వెంకట్‌ను , ఓ కేసులో సరిగా విచారణ చేయనందుకు శ్రీనివాస్ ను సస్పెండ్ చేశారు. కొన్నిరోజుల క్రితం నిజాంపేట్ రోడ్ ప్రశాంత్ నగర్ కాలనీలో ఉండే ప్రణీత్ అనే యువకుడిని కేపీహెచ్ బీ పోలీసులు ఓ కేసు ఎంక్వైరీ కోసం విచారణకు పిలిచారు. అయితే పోలీస్ స్టేషన్ లో తనను తీవ్రంగా కొట్టారని, థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితుడు ఆరోపించాడు. తీవ్ర గాయాలైన ప్రణీత్ ముందుగా కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని మెరుగైన ట్రీట్ మెంట్ కోసం కొన్నిరోజుల తర్వాత గాంధీ ఆస్పత్రికి వెళ్లాడు. ఈ విషయం సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. ఇవాళ సస్పెండ్ చేశారు.

## దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

ఒక్కరోజే ఆరుగురు మృత్యువాత



3వ పేజీలో...

## హైదరాబాద్ చేరుకున్న అమిత్ షా

ఎయిర్‌పోర్టులో బిజెపి నేతల ఘన స్వాగతం



**హైదరాబాద్, డిసెంబర్ 2(సమ సమాజం):** బీజేపీ అగ్రనేత,కేంద్ర హోంమంత్రి అమిత్ షా నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అమిత్ షాకు కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల, తరుణ్ చుగ్ పొంగులేటి తదితరులు స్వాగతం పలికారు. ఎయిర్పోర్ట్ నుంచి నోవాటెల్ హోటల్‌కు కేంద్ర హోంమంత్రి బయలుదేరి వెళ్లారు. నోవాటెల్ హోటల్లో బీజేపీ ముఖ్య నేతలతో షా సమావేశం కానున్నారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులపై రాష్ట్ర నేతలతో అమిత్ షా చర్చించనున్నారు. నేరుగా 3వ పేజీలో...

## నేను ఎప్పటికీ మీ సీతక్కనే....?

మేడం అని పిలిస్తే దూరం అవుతాం

మాది గడీల పాలన కాదు..గల్లీ బిడ్డల పాలన

కుమ్ంభీమ్ గడ్డపై ప్రజాపాలన చేపట్టడం ఆనందగా ఉంది



**ఆదిలాబాద్, డిసెంబర్ 2(సమ సమాజం):** నన్ను మేడం అని పిలవొద్దు. సీతక్క అని పిలవండి. మేడం... మేడం అంటే దూరం అయిపోతము. అదే గుర్తు పెట్టుకోండి. సీతక్క అంటేనే మీ అక్క, మీ చెల్లిలాగా కలిసి పోతాం. పదవులు శాశ్వతం కాదు.. విలువలు, మంచి పనులే శాశ్వతం. కాంగ్రెస్ పాలన అంటే గడీల పాలన కాదు, గల్లీ బిడ్డల పాలన. ప్రజలకు ఏ అవసరం ఉన్నా మాతో స్వేచ్ఛగా చెప్పుకోవచ్చని అంటూ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలం జామినిలో ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఇలా 3వ పేజీలో...

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

### జెండాను ఆవిష్కరించిన మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, డిసెంబర్ 2(సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగా అధికారంలోకి వచ్చామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని విజయ తీరాలకు తీసుకెళ్లి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. రాహుల్ గాంధీ త్వరలో చేపట్టే యాత్రను విజయవంతంగా చేపట్టాలని, ప్రతి కార్యకర్త తమ వంతు సహకారం అందించాలని మహేష్ కుమార్ వినతి చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమానులకు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. 1885 డిసెంబర్ 8న బొంబాయిలో 72 మందితో ఏర్పడ్డ జాతీయ కాంగ్రెస్ పార్టీ నేడు దేశంలోని 140 కోట్ల ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రజల్లో 3వ పేజీలో...



కార్యకర్తల కృషి ఫలితంగానే అధికారం

# నులిపురుగు మాత్రలతో ఆరోగ్యం

నిజామాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నదని, విద్యార్థులు ఆరోగ్యంగా ఎదిగి చదువుతో పాటు మంచి భవిష్యత్తు కలిగి ఉండేలా కృషి చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లల్లో రక్తహీనతను నివారించి చురుకుగా, ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిదండ్రులు నులి పురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా ఇప్పించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులందరికీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు గుర్తించిన వ్యాధులకు చికిత్సలను కూడా అందిస్తుందని తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు వారందరికీ నులి పురుగుల నివారణ మాత్రలను అందించాలని సూచిస్తున్నారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యనభ్యసించడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. పిల్లలకు ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలతో పాటు అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు పంపిణీ అవసరమని అన్నారు.

# తమిళ సినీరంగంలో విషాదం

## నటుడు విజయకాంత్ మరణం

## సంతాపం ప్రకటించిన మోడీ, కమల్, ఎన్టీఆర్



చెన్నై, డిసెంబర్ 28 (సమ సమాజం): తమిళ నటుడు, డీఎండీకే అధినేత కెప్టెన్ విజయకాంత్ కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరారు. పరీక్షల్లో ఆయనకు కొవిడ్ నిర్ధారణ అయింది. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించినప్పటికీ లాభం లేకుండా పోయింది. పరిస్థితి విషమించడంతో విజయకాంత్ తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు తమిళనాడు ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రకటించారు. 71 ఏండ్ల విజయకాంత్ ఏడాది కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గత నెల 18న జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలతో చెన్నైలోని మియోట్ దవాఖానలో చేరారు. చికిత్స అనంతరం కోలుకుని డిసెంబర్ 11న ఇంటికి చేరుకున్నారు. అయితే అప్పుడే ఆయన మరణించారనే వార్తలు నెట్టింట షికారు చేశాయి. అయితే ఆ వదంతులను ఆయన సతీమణి ప్రేమలత కొట్టిపారేశారు. అయితే రెండు వారాలు గడువకముందే ఆయన కొవిడ్ బారినపడటం, మరోసారి శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. తమిళ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన విజయకాంత్.. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లో సైతం అడుగుపెట్టారు. 2005లో డీఎండీకే పార్టీని స్థాపించారు. విజయకాంత్ మృతి పట్ల తమిళనాడు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. విజయకాంత్ తమిళ సినిమా లెజెండ్. ఆయన నటన లక్షల మంది హృదయాలను తాకింది. రాజకీయ నాయకుడిగా తమిళనాడు రాజకీయాల్లో శాశ్వత ప్రభావాన్ని చూపించారు విజయకాంత్. ప్రజా సేవలో ఉంటూ, వారి సమస్యలపై చాలా ఏళ్లుగా పోరాడారు. తమిళనాడు రాజకీయాల్లో ఆయన లేనిలోటు తీరనిదని ప్రధాని మోడీ అన్నారు.నా సోదరుడు విజయకాంత్ మరణవార్త తీవ్ర విషాదాన్ని నింపిందని కమల్ హాసన్ అన్నారు. తమిళనాడు రాజకీయాల్లో ఆయనది ప్రత్యేకమైన స్థానం. సినీ, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన విప్లవ కళాకారుడు ఆయన. తమిళ సినీ, రాజకీయ రంగాల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విజయకాంత్‌గారి మరణ వార్త చాలా బాధాకరం అని సినిమా, రాజకీమ రంగాల్లో ఆయనొక పవర్‌హౌస్ అంటూ ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఒక మంచి నటుడితో పాటు మనసున్న రాజకీయనాయకుడిని సినీ పరిశ్రమ కోల్పోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

# దరఖాస్తుల కోసం ప్రజల ఇక్కట్లు

## ఎమ్మెల్యే రాజాసింగ్ అభ్యంతరం



హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): ప్రజాపాలన ఏర్పాట్లపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో అభయ హస్తం - ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గోషామహల్, మంగళహాట్ డివిజన్‌లను ఎమ్మెల్యే రాజాసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ఏర్పాట్లపై ఆయన అభ్యంతరం తెలిపారు. వార్డు కార్యాలయాల్లో ప్రజలకు దరఖాస్తులు ఫామ్స్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు దరఖాస్తులు ఇవ్వకుండా బయట జిరాక్స్ షాప్‌లో తెచ్చుకోవాలని, ఒక్కో దరఖాస్తుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు.

# ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

## ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ ఫస్టియర్, ఫిబ్రవరి 29వ తేదీ నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 17వ తేదీన ఎథిక్స్ ,హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామినేషన్, ఫిబ్రవరి 19వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సెకండ్ ఇయర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది తొలిసారిగా ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌ను కూడా నిర్వహించనున్నారు. ఈ ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 16వ తేదీన నిర్వహించనున్నారు. రెండో శనివారం, ఆదివారాల్లోనూ ప్రాక్టికల్స్ జరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరి 16న ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఉంటుంది. ఫిబ్రవరి 28న సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1, మార్చి 1న ఇంగ్లీష్ పేపర్-1, 4న మ్యాథ్స్ పేపర్-1ం, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1, మార్చి 6న మ్యాథ్స్ పేపర్-1ః, హిస్టరీ పేపర్-1, జువాలజీ పేపర్-1, మార్చి 11న ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1, మార్చి 13న కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1 ఉంటాయి.

# రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలనకు శ్రీకారం

## దరఖాస్తులను సొమ్ము చేసుకుంటున్న దళారీలు



హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): తెలంగాణవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమాలు మొదలయ్యాయి. గురువారం అభయహస్తం దరఖాస్తులను అధికారులు ప్రారంభించారు. ఐదు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తు ఫారాలను ప్రజలకు అధికారులు అందజేస్తున్నారు. అయితే ప్రజాపాలన.. అభయ హస్తం అప్లికేషన్ ఫామ్‌ల విషయంలో సరికొత్త దందాకు కొందరు దళారులు తెరతీశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒక్కో ఫారంను రూ.50 నుంచి రూ.100 రూపాలకు అమ్ముతున్నారు. ప్రతీ కౌంటర్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో పేద ప్రజలు తప్పదని దరఖాస్తు ఫామ్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న అప్లికేషన్ ఫామ్‌లను కూడా కొందరు దళారులు, జిరాక్స్ సెంటర్లు దళారులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెద్ద ఎత్తున అమ్మకాలు చేపట్టంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదల కోసం ప్రభుత్వం తీసుకువస్తున్న పథకాలకు సంబంధించి ఫామ్ల విషయంలో దళారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని పేద ప్రజలు కోరుతున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అభయహస్తం దరఖాస్తులను అధికారులు ప్రజలకు అందిజేస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. పర్యవేక్షణ కోసం మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉండనుంది.

# బిఆర్ఎస్ మోసాలను ఎండగట్టాల్సిందే !

తెలంగాణలో ప్రజాపాలన మొదలయ్యింది. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం మొదలయ్యింది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు సంబంధించిన కార్యాచరణ మొదలయ్యింది. ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అంతే గాకుండా ప్రభుత్వాన్ని గడీల నుంచి..ప్రజల చెంతకు తీసుకుని వెళతామని చెప్పారు. అయితే అప్పులకుప్పను ఎలా అధిగమిస్తారన్నదే సమస్య. అప్పులు చేసిన వారిని ఊరికే వదిలితే ఎలా అన్నది కూడా ఆలోచించాలి. తెలంగాణను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ఊరికే వదిలేస్తే దానికి అర్థం లేదు. ఆర్థికంగా దెబ్బతీసిన తీరు దారుణం కాక మరోటి కాదు. ప్రభుత్వం అంటూ ఒకటి ఉందన్న విషయం ఇప్పుడు ప్రజలకు అర్థం అవుతోంది. గత పదేళ్లుగా అసలు తెలంగాణ వచ్చిందా అన్న అనుమానం బుద్ది జీవులకే ఉండేది. ఇక్కడో ప్రభుత్వం ఉందా అన్న విషయం కూడా తెలియదు. ఓ నిరంకుశ ప్రభుత్వంలో మగ్గడం వల్ల అసలు తెలంగాణలో ఉన్నామా లేదా అన్న అనుమానాలు ప్రతి ఒక్కరికీ ఉండేవి. నిజానికి తెలవంగాణ వచ్చిందన్న సోయి కూడా లేకుండా పోయింది. ఎందుకు తెలంగాణ తెచ్చుకున్నామా అన్న అనుమానాలు ,భయాలు కలిగాయి. కెసిఆర్ అధికార దర్పం కోసం, ఆయన, ఆయన కుటుంబ విలాసజీవితం కోసం మనమంతా పోరాడామా అన్న భయం కలుగుతోంది. ఈ అనుమానాలను పటాపంచలు చేస్తూ ..రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా అడుగులు వేస్తున్న తీరు అభినందనీయం. ఎందుకుంటే ఇందుకోసం మనం ఓ పదేళ్లు చీకట్లో మగ్గాల్సి వచ్చింది. సిఎం రేవంత్ రెడ్డి ఓ వైపు ప్రజలకు చేరువ అయ్యే ప్రయత్నం లో ఉంటూనే గత ప్రభుత్వం తాలూకు దుర్మార్గాలను వెల్లడిస్తున్న తీరును అంతా అభినందించాల్సిందే. గతంలోనే కెసిఆర్ ప్రభుత్వం కొత్త వాహనాలను ముందే కొనిపెట్టిన తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో **22** కొత్త కార్లు కొని దాచిపెట్టారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కెసిఆర్ అధికార దర్పానికి ఇది మచ్చుతునక మాత్రమే. మూడోసారి అధికారంలోకి వస్తే వాటిని వాడుదా మనుకున్నారని చెప్పారు. కెసిఆర్ సంపద సృష్టి ఈ విధంగా ఉంటుందన్నారు. నిజంగానే ఇంతకాలం గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెడుతూ వచ్చారు. అప్పులకుప్పగా తెలంగాణను అగాథంలోకి నెట్టారు. నిరంతర కరెంట్ పేరుతో ప్రజలను మోసం చేసి కరిమింగిన వెలగపండులా అప్పులను చూపారు. గడీల మధ్య ప్రజలకు దూరంగా జరిగిన పాలనను గ్రామాలకు తీసుకువస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపాక ..ప్రజాపాలన మొదలయ్యాక మళ్లీ గ్రామాల్లో హడావిడి మొదలయ్యింది. సచివాలయంలో జ్నలిస్టులకు ప్రవేశం కల్పించడం పెద్ద విజయంగానే చూడాలి. దోచుకున్న సొమ్ము మొత్తం ప్రజలకు చేరేలా చేస్తామని ప్రకటించిన మేరకు చర్యలకు ఉపక్రమించాలి. అలాగే తాము ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదని చేసిన ప్రకటన కూడా నిఉద్యోగుల్లో భరోసా నింపేదిగా ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతా యన్న భరోసా కలిగింది.గత ప్రభుత్వ అవినీతిపై శ్వేతపత్రాలు విడుదల చేశాక **.6.71**లక్షల కోట్లు అప్పులు చేసి నిండా ముంచారు. పరిస్థితుల నుంచి తేరుకుని ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నందున...ప్రజలు కూడా ప్రభుత్వాన్ని ముందుకు వెళ్లేందుకు అండగా నిలవాల్సి ఉంది. ఇప్పుడు ప్రభుత్వమే ప్రజలకోసం వారి వద్దకు వెళ్తున్నది. ఒకప్పుడు సచివాలయం అంటే ఏదో తెలియదు. మంత్రులు, అధికారులు అందుబాటులో ఉంటున్నారు. అన్నింటికి మించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు, ఫలితాల తరువాత ప్రకటించిన మేరకు వివిధ అంశాల మీద శ్వేతపత్రాలను ప్రకటిస్తూ జనాలకు వాస్తవాలను

వెల్లడించడం ద్వారా ప్రజలకు వెల్లడించారు. వీటికి పోటీగా స్వేద పత్రాన్ని విడుదల చేసిన కెటిఆర్ అభాసు పాలయ్యారు. అప్పులు కాదు..ఆస్తులు సృష్టించామని చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఆస్తులు సృష్టిస్తే భూములు ఎందుకు అమ్మారన్నది చెప్పాలి. ఎందుకు వృథా ఖ్చులు చేశారో చెప్పాలి. ప్రతిష్మాత్మక ప్రాజెక్టుగా లోకానికి చూపించిన కాళేశ్వరం పథకానికి రుణ మంజూరు రూ. **97,449** కోట్లు కాగా విడుదల చేసింది రూ. **79,287** కోట్లు, దీని అప్పు ఇంకా రూ. **74,590** కోట్లు వుంది. ఈ రుణాలకు గాను చెల్లిస్తున్న అసలు, వడ్డీలు తడిసి మోపెడు అవుతున్నాయి. ఈ కారణంగానే ప్రతి నెలా ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటవ తేదీనే చెల్లించ లేని స్థితి. పిఆర్‌సి, కరువు భత్యం వాయిదాల పద్దతిలో చెల్లిస్తుండగా, సకాలంలో మంజూరు చేయకుండా సంవత్స రాల తరబడి నిలిపివేస్తున్నారు. ఇవన్నీ దాచిపెట్టి బ్రహ్మాండంగా చేశామని చెప్పుకోవడం గత పాలకుల పైత్యానికి పరాకాష్టగా చూడాలి. శ్వేతపత్రాలపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రకటనలపై ఎదురుదాడి చేసినా ఇప్పుడు నిజాలు దాగవు. ఆర్థిక పరిస్థితి ఇంతగా దిగజారలేదని ..చెప్పితే ప్రజలు నమ్మరు. అవన్నీ కూడా అధికారులు తయారు చేసి ఇచ్చినవే. గత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి విద్యుత్ సంస్థలు, ఇతరులకు పెద్ద ఎత్తున బకాయి పెట్టింది. అప్పులు తెచ్చుకొనే అవకాశాలన్నింటినీ వాడుకొని కొత్తగా పుట్టకుండా చేసింది. వడ్డీ, అసలు వాయిదాలకే పరిమితంగా తీసుకొనే అప్పు సరిపోదు. రైతుబంధు పథకంలో పెద్ద రైతులకు మినహాయిస్తామని చెప్పినందున దాని వలన పెద్దగా మిగిలేదేమీ వుండదు. చేయాల్సిన అప్పులు చేసి..ఆస్తులు సృష్టించామంటే ఎవరు కూడా నమ్మరు. ఈ క్రమంలో ఫిబ్రవరిలోనే పా÷-లమెంట్ నోటిఫికేషన్ వస్తుందని చెబుతున్నారు. గనుక అప్పటి వరకు శ్వేత పత్రాలు, వాటి మీద చర్చ సాగుతుంటుంది. ప్రజల్లో కూడా ఆలచన వస్తుంది. కెసిఆర్ ప్రభుత్వం తన ఆడంబరం కోసం అప్పులు చేశారన్నది అక్షరసత్యం. కళ్లముందు కనిపిస్తున్న నిప్పులాంటి నిజం. విద్యుత్ సంస్థలకు బకాయిలు పెట్టినందుకు గత ప్రభుత్వాన్ని విమర్శించాల్సిందే. కాంగ్రెస్ అంత పెద్ద మొత్తాలను వెంటనే ఎలా తీరుస్తుందన్నది ప్రశ్న. ఉద్యోగులు వేతనాలు, పెన్షన్లు పెరిగేవే తప్ప తగ్గవు. వడ్డీల చెల్లింపు తప్పదు. ఇవన్నీ సరిదిద్దుకునేందుకు సమయం పట్టినా...తామంతా బ్రహ్మాండంగా చేశామన్న వారి బండారాన్ని బయటపెడితే తప్ప ..ప్రజలకు నిత్యం చేరవేస్తే తప్ప పాప పరిహారం జరగదు. మరోమారు ప్రజలు వారిని నమ్మి మోసపోకుండా చేయాల్సిందే.

# జనవరి 1 నుంచి నుమాయిష్

## ఎగ్జిబిషన్ ప్రారంభానికి ఏర్పాట్లు● రూ.40గా టికెట్ ధర ఖరారు



హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): హైదరాబాద్నుమాయిష్‌కు రంగం సిద్ధం అయ్యింది. జనవరి 1 నుంచి ప్రారంభం కానుంది. 2,400 స్టాళ్లు.. 46 రోజులు.. అతి పెద్ద పారిశ్రామిక ప్రదర్శన 'నుమాయిష్' కోసం భాగ్యనగరం సిద్ధమవుతోంది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జనవరి 1న 83వ 'నుమాయిష్' ప్రారంభానికి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. దేశంలోని పలు రాష్ట్రాల ఉత్పత్తులతో పాటు తెలంగాణ, ఏపీలకు చెందిన పలు ఉత్పత్తులు, ప్రభుత్వాల స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకూ 'నుమాయిష్' ప్రదర్శన సాగనుంది. 'నుమాయిష్' ఎగ్జిబిషన్ లో అన్ని రకాల వస్తువులు ఒకే చోట లభ్యమవుతాయి. నగరంలో దొరకని పలు రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. దుస్తులు, మంచాలు, కిచెన్ సామాగ్రి, వివిధ రకాల దుప్పట్లు, కశ్మీరీ డ్రై ఫ్రూట్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, కొత్త తరహా ఫర్నీచర్స్, మల్టీ పర్పస్ ఉపకరణాలు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ స్టాల్స్, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు అమ్యూజ్మెంట్ పార్క్ ఇలా అన్నీ ఎగ్జిబిషన్ లో కొలువుదీరనున్నాయి. ఇప్పటికే దాదాపు స్టాళ్ల కేటాయింపులు పూర్తి కాగా, పలు స్టాళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎగ్జిబిషన్ ను సందర్శించే వారి కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తోంది. ఎగ్జిబిషన్ కు వచ్చే వారిని గోషామహల్, అజంతా గేట్, గాంధీభవన్ గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తారు. టికెట్ ధర రూ.40గా నిర్ధారించారు. వినోదాత్మకమైన పలు విభాగాలు అందుబాటులో ఉంటాయి. ఎగ్జిబిషన్ కు వచ్చే సందర్శకుల కోసం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆహ్లాదకర వాతావరణంలో అందరూ మెచ్చేలా 'నుమాయిష్' సాగుతుందని ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్ తెలిపారు. 33 సబ్ కమిటీల ద్వారా ఎగ్జిబిషన్ విజయవంతంగా కొనసాగిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సబ్ కమిటీల ప్రతినిధులు తగిన చర్యలు తీసుకుంటారని సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ చెప్పారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యా రంగ వ్యాప్తికి కృషి చేస్తున్నామని ఎగ్జిబిషన్ కార్యదర్శి బి.హన్మంతరావు చెప్పారు. ముఖ్యంగా మహిళా కళాశాలలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను స్థాపించి విద్యా వ్యాప్తికి నిరంతరం పాటు పడుతున్నామని పేర్కొన్నారు. 1938వ సంవత్సరంలో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నేతృత్వంలో ప్రారంభమైన ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన అప్పట్లో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించేవారు. ఆ తర్వాత 1946లో నాంపల్లిలోనూ ఎగ్జిబిషన్ మైదానంలోని 26 ఎకరాల సువిశాల స్థలంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న 'నుమాయిష్' కార్యక్రమానికి దేశ, విదేశాల్లో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం లభించడం సహా, వాటి విక్రయాలకు సైతం ఈ ఈవెంట్ కేంద్రంగా నిలుస్తోంది. ప్రతి ఏడాది దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్ ను సందర్శిస్తారు.

# మేనిఫెస్టోలపై చర్చకు సిద్ధమా?

## 99.5శాతం హామీలను అమలు చేసిన నేత సీఎం జగన్‌ది

## పొత్తుల పేరుతో అందరి కాళ్లు పట్టుకుంటున్న బాబు

## మేనిఫెస్టో ఫెయిల్ అంటూ అచ్చన్న వ్యాఖ్యలపై జోగి మండిపాటు



అమరావతి, డిసెంబర్ 28 (సమ సమాజం): మీ మేనిఫెస్టో..మా మేనిఫెస్టోలపై చర్చిద్దామా అని టిడిపికి మంత్ఇ జోగి మేశ్ సవాల్ చేశారు. నూటికి నూరుపాళ్లు మేనిఫెస్టోను అమలు చేసిన ఘతన సిఎం జగన్‌దని అన్నారు. తెలుగుదేశం పార్టీకి తెగులు పట్టిందని మంత్రి జోగి రమేష్ విమర్శలు గుప్పించారు. టీడీపీ దివాళా తీసిందని అందరికీ తెలుసన్నారు. చంద్రబాబు ఒంటరిగా పోటీ చేసే దమ్ము, ధైర్యం లేదనీ తెలుసని ఎద్దేవా చేశారు. పొత్తుల పేరుతో అందరి కాళ్లు పట్టుకుంటూ చంద్రబాబు తిరుగు తున్నారని దుయ్యబట్టారు. అలాంటి పార్టీకి చెందిన అచ్చెన్నాయుడు వైస్సార్‌సీపీ మేనిఫెస్టో ఫెయిల్ అయిందని ఆరోపించటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. 99.5శాతం హామీలను అమలు చేసిన నేత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదని చెప్పిన జోగి రమేష్.. దీనిని తాము నిరూపిస్తామని తెలిపారు. మేనిఫస్టోలపై చర్చకు వచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. టీడీపీ 2014 నాటి మేనిఫెస్టో, వైఎస్సార్‌సీపీ 2019 నాటి మేనిఫెస్టో మీద చర్చకు రాగలరా?అని ప్రశ్నించారు. మేనిఫెస్టో అంటే తమకు బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానమని తెలిపారు. మేనిఫెస్టో అమలు చేశాం కాబట్టే ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్ళి మళ్ళీ ఓట్లు అడగగలుగుతున్నామన్నారు. చరిత్రలో ఎవరైనా ఎన్నికల తర్వాత ఇలా ఇంటికి వెళ్ళి అమలు చేసిన కార్యక్రమాల గురించి చెప్పారా? అని మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. చంద్రబాబులాగా మేనిఫెస్టోని నెట్ నుంచి తొలగించలేదని దుయ్యబట్టారు. మేనిఫెస్టోని చించి శనక్కాయల పొట్లాలుగా మార్చలేదని మండిపడ్డారు. 2014లో మేనిఫెస్టోని అమలు చేయలేదు కాబట్టే చంద్రబాబును జనం చిత్తుచిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. 'అసలు చంద్రబాబుకు ఏపీతో ఏం పని?. ఈ రాష్ట్రంలో ఆధార్ కార్డు ఉందా?. ఇల్లు, డోర్ నెంబర్ ఉందా?. ఇలాంటి అడ్రస్ లేని వ్యక్తులు మా గురించి మాట్లాడటానికి సిగ్గుండాలి. రైతులు, డ్రాక్రా మహిళలకు రుణమాఫీ పేరుతో దారుణంగా మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేశారు. అలాంటి మోసకారి, దుర్మార్గుడు అయినందునే చంద్రబాబుకు ఈ గతి పట్టింది. 30 లక్షల మందికి ఇళ్లు కట్టిస్తున్న జగన్ లాంటి సీఎం దేశంలో ఎక్కడైనా ఉన్నారా?. అసలు చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. 'చంద్రబాబు దిక్కుమాలిన మేనిఫెస్టోని అసలు ఎవరైనా నమ్ముతారా?. చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోకాళ్ల మీద నడిచినా ఆ పాపం పోదు. మళ్ళీ ఈరోజు మహిళలకు ఉచిత ప్రయాణమని అంటున్నారు. మేము ఎలాంటి ప్రకటనా చేయకపోయినా మాపై ఆరోపణలు చేస్తున్నారు. రామోజీ, రాధాకృష్ణ, చంద్రబాబు, పవన్, లోకేష్ ఉండేది, తినేది హైదరాబాదులో. అక్కడ కూర్చుని ఏపీలో రాజకీయాలు చేయటం ఏంటి?. ఈ ఎన్నికల తర్వాత వారు ఈవైపు ఇక కన్నెత్తి కూడా చూడరని జోగి రమేష్ విమర్శించారు.

# గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



జాతీయ భావాన్ని రేకెత్తించి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. దేశంలో ప్రజలను ఐక్యం చేసి బ్రిటిష్ వారి నుంచి దేశానికి స్వాతంత్యం÷-ర తేవడంలో కీలకపాత్ర వహించింది కాంగ్రెస్ అని అన్నారు. ఎంతో మంది స్వతంత్ర పోరాటంలో భాగస్వాములు అయ్యి కుటుంబాలను, ఆస్తులను త్యాగం చేసి ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గి దేశానికి స్వాతంత్యం÷-ర తెచ్చారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశంలో ప్రజలు తీవ్రమైన పేదరికంలో ఉన్నారని తెలిపారు. ఒకవైపు ప్రజలు కనీస అవసరాలు తీర్చడం, మరోవైపు దేశాన్ని పటిష్టం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేసిన సేవలు ప్రజలు మరవలేరన్నారు. 50 ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ప్రపంచంలో ఒక బలమైన ఆర్థిక పరిపుష్టి గల దేశంగా తీర్చిదిద్దిందని చెప్పుకొచ్చారు. గాంధీ, నెహ్రూల కలయిక ఈ దేశానికి ఎంతో మేలు చేసిందన్నారు. వేలాది మంది త్యాగం, వారి జైలు జీవితం వారి నిస్వార్థ సేవతోనే నేడు మనం స్వతంత్ర దేశంలో అన్ని హక్కులను అనుభవిస్తూ జీవిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ 139 ఏళ్లుగా ఈ దేశంలో ఒక పటిష్టమైన పార్టీగా నెలదొక్కుకుందంటే ఆ పార్టీ మూల సిద్ధాంతాలు.. పార్టీలోని నాయకులు కారణమన్నారు. సోనియమ్మ, పీవీ, మన్మోహన్, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లాంటి వాళ్ళు దేశం కోసం నిరంతరం శ్రమించారు. దేశానికి స్వాతంత్యం÷-ర తెచ్చిన తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షలను తీర్చినా అది కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యం అయ్యిందని చెప్పుకొచ్చారు.

# నేను ఎప్పటికీ మీ సీతక్కనే....?




ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి సీతక్క ఆదివాసీలతో కలిసి సందడి చేశారు. ప్రజాపాలన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా జైనథ్ మండలం ఆదివాసీ గ్రామం జామినిలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. అడవుల జిల్లా ఆదిలాబాద్‌కు ఇన్‌చార్జ్ మంత్రిగా సీఎం తనకు బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తనను మేడమ్ అని సంబోదిస్తున్న అక్కడి కిందిస్థాయి ఉద్యోగులతో .. తానెప్పటికీ సీతక్కనేనని, తనను సీతక్క అనే పిలవాలంటూ సూచించారు. ఆదిలాబాద్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం హక్కున చేర్చుకుంటుందని.. జిల్లా అభివృద్ధికి తమ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా జామినికి రావడం.. కొమురంభీం గడ్డపై నుండి ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించడం ఆదివాసీ బిడ్డగా తనకు మరింత తృప్తినిచ్చిందని తెలిపారు. ప్రజాపాలన లో ఆరు గ్యారంటీలు దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు , సిబ్బందితో పాటు పార్టీ కార్యకర్తలు కూడా అన్ని విదాలుగా సాయం చేస్తారని తెలిపారు. ఆదివాసీ గూడాల్లో నిరక్షరాస్యులకు స్థానిక యువత సాయం చేయాలని.. దరఖాస్తులు నింపే విషయంలో స్థానిక యువత అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గతం ప్రభుత్వంలో లాగా జిరాక్స్ సెంటర్ల వద్ద మీసేవల వద్ద లైన్లు కట్టి దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని.. ప్రజల వద్దకే అధికారులు , సిబ్బంది వచ్చి దరఖాస్తులు తీసుకుంటారని తెలిపారు. ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తామని.. కొత్త రేషన్ కార్డ్‌ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంద న్నారు.

# హైదరాబాద్ చేరుకున్న అమిత్ షా



ఆయన చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయానికి వెళ్ళారు.అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. 3:50 గంటలకు కొంగరకలాన్‌లోని శ్లోక కన్వెన్షన్‌కు కేంద్రహోంమంత్రి చేరుకుంటారు. గంటన్నర పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. పార్లమెంట్ ఎన్నికలపై రాష్ట్రనేతలకు బీజేపీ అగ్రినేత దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం కొంగరకాలన్ నుంచి శంషాబాద్ నోవాటెల్ హోటల్‌కు చేరుకుంటారు. సాయంత్రం నోవాటెల్‌లో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలతో సమావేశంకానున్నారు. అసెంబ్లీలో బీజేపీ శాసనసభపక్ష నేతను అమిత్ షా ఎంపిక చేయనున్నారు. సాయంత్రం ఢిల్లీకి తిరుగు ప్రయాణంకానున్నారు.

# చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే


**క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవాలి**

**ఫుట్‌బాల్ పోటీల ప్రారంభంలో హరీష్ రావు**




సిద్దిపేట, డిసెంబర్ 28 (సమ సమాజం): చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. విద్యతోపాటు క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని సూచించారు. చదవుతోపాటు ఆటల్లో ప్రతిభ చూపించినవారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. సిద్దిపేట ఫుట్‌బాల్ స్టేడియంలో ఇంటర్‌స్కూల్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని జాతీయ స్థాయి ఆటలకు సిద్దిపేట వేదికగా నిలిచిందన్నారు. ఆటలు అదుర్స్ అనేలా అన్ని వేదికలను పట్టణంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని ఆటలకు నెలవుగా సిద్దిపేట మారిందని చెప్పారు. పాఠశాలల స్థాయికే పరిమితమైన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు పంపేల సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 16 రకాల క్రీడలకు సంబంధించిన మైదానాలు, కోర్టులు, సౌకర్యాలను ఏర్పాటు చేశామని, దీంతో అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు అతిథ్యం ఇచ్చామన్నారు. స్విమ్మింగ్ ఫుల్ జాతీయ స్థాయిలో పోటీలకు, బ్యాడ్మింటన్, వాలిబాల్ రాష్ట్ర జాతీయ స్థాయి సెలెక్షన్స్, ఫుట్‌బాల్ సెలెక్షన్స్, రంగనాయక సాగర్ వద్ద జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్దిపేట వేదికయిందని చెప్పారు. సిద్దిపేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మరో రూ.11 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నామని, క్రికెట్ స్టేడియానికి రూ.4 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, హాకీ, కరాటే, రన్నింగ్, హ్యాండ్ బాల్, షాట్‌పుట్, స్కెటింగ్, అ÷-లథెటిక్స్ తోపాటు ఇటీవలే నూతన వాలీబాల్ అకాడమీ ఏర్పాటైందని చెప్పారు.

# దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు



న్యూఢిల్లీ, డిసెంబర్ 28 (సమ సమాజం): భారత్‌లో కరోనా కేసుల ఉధృతి పెరుగుతోంది. గురువారం ఒక్కరోజే 702 కరోనా కేసులు పెరిగాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ఉదయం 8 గంటలకు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. యాక్టివ్ కేసుల సంఖ్య 4,097కి పెరిగాయి. 24 గంటల వ్యవధిలో ఆరు కొత్త మరణాలు నమోదవగా, మహారాష్ట్ర నుండి ఇద్దరు, కర్ణాటక, కేరళ, పశ్చిమబెంగాల్, ఢిల్లీలో ఒక్కొక్కరు చొప్పున మరణించినట్లు తెలిపింది. డిసెంబర్ 5 వరకు కేసులు రెండంకెలకు పడిపోయాయని, అయితే కొత్త వేరియంట్ , చల్లని వాతావరణ పరిస్థితుల కారణంగా కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపింది. డిసెంబర్ 22న దేశంలో 752 కొత్త కేసులు నమోదయ్యాయి. 2020 మహమ్మారి ప్రారంభంలో రోజువారీ కేసులు లక్షల్లో గరిష్టస్థాయికి చేరుకున్నాయి. 4.5కోట్ల మందికి పైగా ప్రజలు వ్యాధి బారిన పడ్డారు. అప్పటి నుండి దేశవ్యాప్తంగా సుమారు నాలుగేళ్లలో 5.3 లక్షల మంది మరణించారు. జాతీయ రికవరీ రేటు 98.81 శాతంగా ఉండగా, వ్యాధి నుండి కోలుకున్న వారి సంఖ్య 4.4 కోట్లను దాటింది.

# ఢిల్లీలో ప్రస్తుతం జేఎన్.1 కేసులు లేవు: మంత్రి



న్యూఢిల్లీ, డిసెంబర్ 28 (సమ సమాజం): దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం ఎలాంటి జేఎన్.1 కేసులు లేవని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తాజాగా వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 తొలి కేసు వెలుగు చూసిన విషయం తెలిసిందే. మొత్తం ముగ్గురి శాంపుల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపించగా అందులో ఒకరికి ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్.1 సోకినట్లు బయటపడింది. అయితే, వైరస్ సోకిన వ్యక్తి గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు ఆరోగ్య మంత్రి తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం అతడు పూర్తి ఆరోగ్యంతో ఉన్నాడని పేర్కొన్నారు. ఇప్పుడు ఢిల్లీలో జేఎన్.1 వేరియంట్ రోగులు లేరని స్పష్టం చేశారు. దేశంలో కరోనా సబ్ వేరియంట్ జెఎన్-1 చాపకింద నీరులా పాకుతున్నది. మంగళవారం ఒక్కరోజే 40 వేరియంట్ కేసులు బయటపడ్డాయి. మంగళవారం రాత్రి వరకు మొత్తం సుల సంఖ్య 109కి చేరింది. అందులో అత్యధికంగా గుజరాత్‌లో 36 కేసులు, కర్ణాటకలో 34, గోవాలో 14, మహారాష్ట్రలో 9, కేరళలో 6, రాజస్థాన్‌లో 4, తమిళనాడులో 4, తెలంగాణలో 2 కేసులు రికార్డయ్యాయి.

# 17వరోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

**పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన మహిళలు**

**కోనసీమ జిల్లాలో ముగ్గిరిని సస్పెండ్ చేసిన అధికారులు**



కోనసీమ, డిసెంబర్ 28 (సమ సమాజం): సమ్మెబాట పట్టిన వాలంటీర్లపై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది. సమ్మెకు దిగిన వాలంటీర్లను సర్వీస్ నుంచి టెర్మినేట్ చేయాలని సర్కార్ నిర్ణయించింది. కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీలో బుధవారం సమ్మెకు దిగిన 18 మంది వాలంటీర్లలో ముగ్గురిని తప్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ అయ్యాయి. మరికొందరిని తప్పించడానికి అధికారుల అడుగులు వేస్తున్నారు. ఎవరు సమ్మె చేసినా ఊరుకోవద్దని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఆడియో మెసేజ్‌లో ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తీరు పట్ల వాలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మెడకు ఉరి తాళ్ళు బిగించుకొని నిరసన తెలిపారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదన్నారు.ప్రభుత్వం ఎంత బెదిరిస్తే ఉద్యమం అంతే స్థాయిలో ఉదతం చేస్తామని హెచ్చరించారు. శిబిరంలో అంగన్వాడీలు సమస్యలు పరిష్కారం చేయాలని కనీస వేతనాలు అమలు చేయాలని,గ్రాట్యుటీ చెల్లించాలని , మెనూ చార్జీలు పెంచాలని పెద్ద ఎత్తున నినదించారు. రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ప్రతి అంగన్వాడీ మహిళ గురువారం ఉత్తరాలు రాసి తపాలా ద్వారా విజయవాడ లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి పంపించారు. తిరుపతి జిల్లా గూడూరులో పోస్ట్ కార్డుల ద్వారా అంగన్వాడి కార్యకర్తలు నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి కి పోస్ట్ ద్వారా పోస్ట్ కార్డులను పంపించారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు గురువారం చెవిలో పువ్వుతో నిరసన తెలిపాఉ. కడప జిల్లా వేంపల్లెలో అంగన్వాడిల సమస్యను నువ్వేనా ఆలకించంటూ ఎద్దుకు వినతిపత్రం అందించారు. కనీస వేతనం 26000/-ఇవ్వాలని, అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, చివరి నెల జీతంలో సగం జీతం పెన్షన్ గా ఇవ్వాలని, తదితర డిమాండ్లతో కూడిన పోస్ట్ కార్డులు ముఖ్యమంత్రికి పిసిపల్లి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో పంపడమైనది. అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇబ్రహీంపట్నంలోని మంత్రి జోగి రమేష్ ఇంటిని అంగన్వాడి కార్యకర్తలు, సిఐటియు నాయకులు ముట్టడి కార్యక్రమం చేపట్టారు. చాపాడులో గురువారం కోతికి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తల మండల నాయకులు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవడం లేదన్నారు.అందుకే కోతికి తమ బాధలను తెలియజేస్తున్నామన్నారు.చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు జగన్ వేతనాలు పెంచుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గుంటూరు వివిఎస్ఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో సిఐటియు, సిపిఎం పార్టీలు తమ పూర్తి మద్దతును తెలిపాయి, పలు సంఘాల ప్రతినిధులు అంగన్వాడీలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం నిర్వహించిన సమ్మెలో సీఎం జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్లను తెలియజేశారు. అనంతపురం జిల్లా చిలమత్తూరులో పోస్టల్ కార్డు ఉద్యమం చేపట్టారు. పలు జిల్లాల్లో పోసట్ కార్డు ఉద్యమం చేపట్టారు.

# 600 కిలోల అయోధ్య రామాలయ గంట

**అష్టధాతువులతో తమిళనాడులో తయారీ**




అయోధ్య, డిసెంబర్ 28 (సమ సమాజం): ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీ రామ మందిర గర్భగుడి నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. భవ్య రామమందిరం తుది మెరుగులు దిద్దుకుంటోంది. జనవరి 22న ఐదేళ్ల బాలుడి రూపంలో శ్రీరాముడు ఆలయంలో కొలువుదీరనున్నాడు. రాముడి విగ్రహానికి ఎన్ని విశిష్టతలున్నాయో.. అక్కడ ఏర్పాటు చేయబోయే గంటకూ అన్నే విశేషాలున్నాయి. దీనిని తమిళనాడులో ప్రత్యేకంగా తయారు చేయించారు. అష్టధాతువుతో తయారు చేసిన ఈ గంట రామ మందిరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 600 కిలోలకు పైగా బరువున్న దీనిని ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ 2020 నుంచే తయారు చేయడం ప్రారంభించారు. రామమందిర ప్రారంభోత్సవం దగ్గర పడుతుండడంతో తమిళనాడు నుంచి అయోధ్యకు తరలించారు. గంటపై జై శ్రీరామ్ అని రాసి ఉంది. దీనిని ప్రస్తుతం ఆయోధ్య రామమందిర ప్రాంగణంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. ఇక జనవరిలో జరగనున్న రామమందిర ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రస్తుతం రామ్‌లల్లా విగ్రహాలు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. కాశీ పండితులు అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

# కనీసం పదిసీట్లు గెలవాల్సిందే



**మోడీకి కానుకగా ఇచ్చేలా పనిచేయండి**

**బిజెపి శ్రేణులకు అమిత్‌షా దిశానిర్దేశం**

**350 సీట్లతో బిజెపిదే మళ్లీ అధికారమని వ్యాఖ్య**

హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతానికి పైగా ఓట్లు సాధించి.. తెలంగాణ నుంచి 10 సీట్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహుమతిగా ఇవ్వాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఒక రోజు తెలంగాణ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన అమిత్ షా.. కొంగరకలాన్‌లో నిర్వహించిన బీజేపీ విస్తృతస్థాయి సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో ఒక్క ఎమ్మెల్యే సీటు మాత్రమే సాధించిందని.. అయితే తాజా ఎన్నికల్లో 8 సీట్లతో మెరుగైన ఫలితాలు సాధించామని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కచ్చితంగా 64 సీట్లు నుంచి 95 సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే.. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 35 శాతానికి పైగా ఓట్లు సాధిస్తామని, 10 సీట్లకు పైగా గెలుస్తామని అమిత్ షా నమ్మకం వెలిబుచ్చారు. తమ ప్రభుత్వం మాదిగ సామాజిక వర్గానికి అండగా ఉంటుందని, ఆ వర్గానికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కుటుంబ పార్టీలేనని విమర్శించారు. తెలంగాణలో కుటుంబ పాలన నుండి విముక్తి పొందామని, దేశంలో కూడా కుటుంబ పాలన రాకుండా చూసుకోవాలని అన్నారు. 2024 జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా 350కి పైగా సీట్లు వస్తాయని.. ప్రతి కార్యకర్త పార్టీ నాది, దేశం మనది అనే భావనతో పని చేస్తే అఖండ విజయం సాధిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం తొమ్మిది సంవత్సరాల్లో తొమ్మిది లక్షల కోట్లకు నిధులు ఇచ్చిందని అమిత్ షా అన్నారు. గురువారం తెలంగాణకు విచ్చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 350కి పైగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా వచ్చిందని, దానికి వేవ్ లేదని విమర్శించారు. ఈసారి కూడా కేంద్రంలో బీజేపీనే అధికారంలోకి వస్తుందని ఆయన నమ్మకం వెలిబుచ్చారు. ప్రతి కార్యకర్త.. పార్టీ నాది, దేశం మనది అనే భావనతో పని చేయాలని పిలుపునిచ్చారు. అలా పని చేస్తే.. తప్పకుండా లోక్‌సభ ఎన్నికల్లో 350 నుండి 400 సీట్లు వస్తాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలని కార్యకర్తల్ని అభ్యర్థించారు. పార్లమెంట్ ఎన్నికలు ఒక వ్యక్తికి చెందినవి కావని.. దేశానికి, దేశ భవిష్యత్తుకు సంబంధించినవని చెప్పు కొచ్చారు. అదే సమయంలో.. విభేదాలు మరిచిపోయి 2024 లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావడంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర నాయకుల్ని అమిత్ షా ఆదేశించారు. రాష్ట్ర నేతల మధ్య విభేదాల కారణంగానే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదని ఆయన చెప్పినట్లు తెలిసింది. వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు సహకరించాలని నేతల్ని సూచించారు. తెలంగాణ బీజేపీ నేతలతో వ్యూహాలపై చర్చించి, తదనుగుణంగా వారికి దిశానిర్దేశర చేశారని తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లను లక్ష్యంగా చేసుకుని మరింత కష్టపడి పనిచేయాలని కోరిక ఆయన.. పార్టీ స్థితిగతులపై నిర్వహించే సర్వే ఆధారంగా సిట్టింగ్ ఎంపీలు, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు కేటాయిస్తామని తేల్చి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను గుర్తించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని నాయకులను కోరారు. కాగా.. ఒక రోజు పర్యటనలో భాగంగా అమిత్ షా గురువారం మధ్యాహ్నం ప్రత్యేక విమాణంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్, ఈటెల రాజేందర్ ఆయనకు శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. పార్టీ నేతలతో భేటీ అయిన తర్వాత చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కొంగరకలాన్‌లోని శ్లోక సమ్మేళనం లో పార్టీ నేతలతో షా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడి నుంచి జాతీయ స్థాయి నాయకుల వరకు అందరూ పాల్గొన్నారు.

# ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

**మోడీ అనే మెడిసిన్‌కు ఎక్స్‌పైరీ డేట్ ముగిసింది**



**రాహుల్ జోడోతో తెలంగాణలో అధికారం**

**ఇప్పుడు మహారాష్ట్రలో కూడా మార్పు రాబోతోంది**

**నాగపూర్ కాంగ్రెస్ ఆవిర్భావ సభలో సిఎం రేవంత్ రెడ్డి**

నాగపూర్, డిసెంబర్ 28 (సమ సమాజం): ఈసారి ఎర్రకోటపై కాంగ్రెస్ మూడు రంగాల జెండా ఎగరడం ఖాయమని.. దీనిని మోదీ కూడా ఆపలేరని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రతి మెడిసిన్‌కు ఒక ఎక్స్‌పైరీ డేట్ ఉంటుందని, ఇప్పుడు నరేంద్రమోదీ అనే మెడిసిన్‌కు కూడా ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో మోదీ అనే మెడిసిన్ దేశంలో పని చేయదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నాగపూర్‌లో నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇదివరకే చేపట్టిన భారత్ జోడో యాత్ర గురించి రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా రాహుల్ భారత్ జోడో యాత్ర చేశారని, 150 రోజుల వరకు సాగిన ఈ యాత్రలో ఆయన 4 వేలకు పైగా కిలోమీటర్లు నడిచారని అన్నారు. భారత్ జోడో యాత్ర స్ఫూర్తితోనే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని.. కర్ణాటక తర్వాత జోడో యాత్ర తెలంగాణలో ప్రవేశించిందని, తెలంగాణలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఈ జోడో యాత్ర మహారాష్ట్రలో ప్రవేశించిందని, కాబట్టి, ఈసారి అక్కడ కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యమని నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పుడు రాహుల్ గాంధీ 'భారత్ న్యాయ యాత్ర'ను మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు చేపట్టనున్నారని.. ఈ దెబ్బకు కేంద్రంలో కాంగ్రెస్ రావడం పక్కా అని రేవంత్ రెడ్డి చెప్పారు. బీజేపీ చెప్పే డబుల్ ఇంజన్ సర్కార్ అంటే.. ఆదానీ, ప్రధాని అని ఆయన అభివర్ణించారు. లోక్‌సభలో రాహుల్ గొంతు విప్పడంతో ఆదానీ ఇంజన్ ఆగిపోయి షెడ్‌కు వెళ్లిందని ఎద్దేవాచేశారు. ఇప్పుడు భారత్ న్యాయ యాత్రతో ప్రధాని ఇంజన్ ఆగిపోవడం ఖాయమని, దాన్ని షెడ్డుకు పంపడం తథ్యమని అన్నారు. దేశంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి దేశాన్ని కాపాడుకుందామని.. ఇందుకోసం కాంగ్రెస్ శ్రేణులంతా పని చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# మీ విభేదాలతో పార్టీకి నష్టం చేశారు

**30 సీట్లు వస్తాయనుకుంటే 8తో సరిపెట్టారు**

**పార్లమెంట్ ఎన్నికల్లో అయినా కలసి పనిచేయండి**

**పార్టీ శ్రేణులకు అమిత్ షా క్లాస్**



హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశ కలిగించాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మీలో విభేదాలే పార్టీ కొంప ముంచాయని అన్నారు. అనుకున్న సీట్లు సాధించలేదని.. 30 సీట్లు వస్తాయని ఆశించామని పేర్కొన్నారు. వర్గ విభేదాల కారణంగానే నష్టపోయామని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్ షా.. హైదరాబాద్ లోని నోవాటెల్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్గ విభేదాలు లేకుండా కలిసి పనిచేయాలని రాష్ట్ర బీజేపీ నేతలకు వార్నింగ్ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కలసికట్టుగా ఎక్కువ సీట్లు సాధించేందుకు పాటుపడాలన్నారు. వర్గ విభేదాల వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో నష్టపోయామని ముఖ్య నేతలకు అమిత్ షా వార్నింగ్ ఇచ్చారు. విభేదాలు లేకుండా కలిసి పనిచేయాలని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుకున్నన్ని సీట్లు సాధించలేదు. లోక్‌సభ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలి. రాష్ట్రం నుంచి అత్యధిక ఎంపీ సీట్లు గెలిచేందుకు కృషి చేయాలి. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ పార్టీకి నష్టం చేయకండి.. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలంటూ తెలంగాణ బీజేపీ ముఖ్య నేతలకు ఆ పార్టీ అగ్రనేత అమిత్‌షా క్లాస్ పీకారు. పార్టీ ముఖ్య నేతలతో అమిత్‌షా సమావేశం హాట్‌హాట్ సాగింది. నేతల మధ్య గ్యాప్ అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతీసింది.. ఇది రిపీట్ కావొద్దంటూ షా హెచ్చరించారు. ఎంపీ టికెట్ ఆశావహులు, వారి బలబలాలపైన ఆరా తీసిన అమిత్ షా.. సిట్టింగ్ ఎంపీలకు అదే స్థానంలో పోటీ చేసేందుకు గ్రీన్ స్నిగల్ ఇచ్చారు. నాలుగు ఎంపీ స్థానాలు మినహా మిగిలిన స్థానాల్లో పార్టీ పరిస్థితిపై కూడా ఆయన ఆరా తీశారు. సిట్టింగ్ ఎంపీలకే మరోసారి అవకాశం కల్పిస్తాం. మిగిలిన చోట్ల సర్వేల ఆధారంగా అవకాశం ఇస్తాం. ఈసారి అభ్యర్థులను త్వరగా ప్రకటిస్తాం అని అమిత్ షా తెలిపారు. అంతకు ముందు శంషాబాద్ విమానాశ్రయంలో అమిత్ షాకు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల రాజేందర్ స్వాగతం పలికారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు, అక్కడి నుంచి నోవాటెల్ హోటల్‌కు చేరుకున్న అమిత్‌షా.. పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. అసెంబ్లీ ఫలితాలపై సమీక్ష, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ట అంశాలపైనా ఆయన రాష్ట్ర పార్టీ నేతలతో సమీక్షించారు. అంతకుముందు భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు.

# ఎన్జీవో ముసుగులో అక్రమాల ప్రచారం

**సొంతానికి నిధుల దుర్వినియోగం ■ స్వతంత్ర వ్యవస్థ పర్యవేక్షణకు డిమాండ్**

న్యూఢిల్లీ, డిసెంబర్ 28 (సమ సమాజం): విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) మరింత పదను కానుంది. నిధుల దుర్వినియోగం, మతమార్పిళ్లు తదితర కారణాలతో దీనిని పటిష్టం చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న కారణంగా గతేడాది 20వేల ఎన్జీవోలకు కేందప్రభుత్వం సంబంధిత లైసెన్సులు రద్దుచేసింది. కొన్ని ఎన్జీవో సంస్థలు అక్రమాలకు పాల్పడుతున్నాయన్నది వాస్తవం. అక్రమాలకు విదేశీ నిధులతో పాల్పడే వారి పీక నొక్కాల్సిందే. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొనసాగిన ఈ తీరుతో దేశంలో ప్రస్తుతం 13వేల ఎన్జీవోలకు మాత్రమే విదేశీ నిధులు అందుకొనే అర్హత మిగిలింది. ఎన్జీవోల పనితీరు, లావాదేవీలకు సంబంధించి ఏడాదికాలంగా జరుగుతున్న సమీక్ష ఇంకా కొనసాగుతోంది. భారతదేశపు ఎఫ్‌సీఆర్ఏ చట్టం అంతర్జాతీయ ప్రమాణాలకు పూర్తి భిన్నంగా, అత్యంత అమానవీయంగా ఉన్నదన్నది విమర్శ. దీనిని రద్దుచేసి ఎన్జీవోల సర్వవ్యవహారాలనూ నియంత్రించడానికి బార్‌కౌన్సిల్ తరహాలో ఒక జాతీయస్థాయి స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలని అంటున్నారు. మూలవాసుల సమస్యలు, పర్యావరణం సహా ప్రభుత్వాలు బేఖాతరుచేస్తున్న పలు ప్రధాన సమస్యలను స్వచ్ఛందసంస్థలే నెత్తికెత్తుకుంటున్నాయి. మత మార్పిళ్ళ కోసం, మత ఉద్రిక్తతల కోసం, ప్రభుత్వంపై విరుచుకుపడటం కోసం విదేశాల్లోని కొన్ని సంస్థల నుంచి ఈదేశంలోని కొన్ని ఎన్జీవోలకు భారీ విరాళాలు అందుతున్నాయంటూ నిఘావర్గాలు హెచ్చరించి నట్టు సమాచారం. దేశంలో పలు రాష్ట్రాల్లో కొన్ని ప్రత్యేక అల్లర్ల వెనక విదేశీ హస్తం ఉందన్న విషయాలు కూడా బయటపడ్డాయి. పౌరసమాజం నుంచి కొందరు ప్రముఖులు ఖండిస్తూ ప్రకటనలు చేశారు. ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సులు రద్దుచేయడంలోనూ, రెన్యువల్ చేయకపోవడం లోనూ అనుసరిస్తున్న పద్ధతులు పారదర్శకంగా లేనందుకు జాతీయ మానవహక్కుల సంస్థ ప్రభుత్వానికి నోటీసు కూడా జారీ చేసింది. అయితే, ప్రభుత్వం వీటన్నింటినీ బేఖాతరు చేస్తూ ముందుకు పోతున్నది. ఎఫ్‌సీఆర్ఏ ప్రభుత్వం చేతిలో ఉన్న అత్యంత బలమైన ఆయుధం. 1976లో ఇందిరాగాంధీ ఈ చట్టాన్ని చేసినప్పుడు అందులో రాజకీయపార్టీలూ, న్యాయమూర్తులు, ఎంపీలు ఉన్నారు. ప్రచ్ఛన్నయుద్ధ కాలం కనుక దేశీయ వ్యవహారాల్లోనూ, రాజకీయా ల్లోనూ విదేశీహస్తం లేకుండా చూడడం దీని లక్ష్యం. అనంతరం ఆర్థిక సంస్కరణల పేరిట ఈ విదేశీ హస్తంతో చేతులు కలిపాం. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న బహుళజాతి సంస్థ 'వేదాంత' దేశీయ విభాగం నుంచి విరాళాలు అందుకున్నందుకు 2014లో ఢిల్లీ హైకోర్టు కాంగ్రెస్, బీజేపీలను చీవాట్లు పెట్టింది. ప్రభుత్వాన్నీ, ఎన్నికల సంఘాన్నీ చర్యలు తీసుకోమన్నది. చర్యలు లేకపోగా, 2010 నాటి చట్టాన్ని తమకనుగుణంగా గత ఏడాది సవరించింది. దీంతో రాజకీయ పార్టీలకు దేశీమార్గాల ద్వారా భారీగా విదేశీనిధులు అందుకొనేందుకు మార్గం సులభమైంది. ఇందిరాగాంధీ చట్టానికి కాంగ్రెస్ ప్రభుత్వం 2010లో చేసిన సవరణల కారణంగా ఎన్జీవోలపై ప్రభుత్వం విరుచుకుపడటానికి వీలు కలిగింది. జీవితకాలపు లైసెన్సు స్థానంలో ఐదేళ్ళకోమారు రెన్యువల్ చేసుకోవాలన్న నిబంధన వచ్చింది. ఇందువల్ల, ప్రభుత్వం ఇప్పుడు ఏ చర్యా తీసుకోకుండానే పదివేల లైసెన్సులను మురగ బెట్టేందుకు వీలుకలిగింది. విదేశీనిధుల్లో యాభైశాతం కంటే ఎక్కువ నిర్వహణకు వాడకూడదన్న నియమం అనేక సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడానికీ వీలు కల్పించింది. ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సుల రద్దుజాబితాలో తీస్తా సెతల్వాద్, షబ్నమ్ హష్మీకి చెందిన సంస్థలతో పాటు ప్రముఖ న్యాయవాది ఇందిరా జైసింగ్ సంస్థ కూడా ఇటీవలే వచ్చిచేరింది. నవ్‌సర్జన్‌ట్రస్టు విదేశాల్లో భారత ప్రభుత్వాన్ని దళిత వ్యతిరేకిగా చిత్రీకరిస్తున్నదని నిఘావర్గాలు సమాచారం ఇవ్వడంతో ఆ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా ఇలాంటి వాటి వ్యవహారాన్ని నిక్కచ్చిగా నిజం తేల్చాల్సిందే.

# నగరంలో భారీగా డ్రగ్స్ పట్టివేత



హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం): హైదరాబాద్ నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ముఠా సభ్యుల నుంచి 100 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. న్యూఇయర్ వేడుకలకు గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. డ్రగ్స్ పట్టుబడిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

# శబరి ఆలయం తాత్కాలికంగా మూసివేత

**30న సాయంత్రం తెరుచుకోనున్న ఆలయం**

**14న మకర విళక్కు పూజలకు ఏర్పాట్లు**



పట్టణంతిట్ట, డిసెంబర్ 28 (సమ సమాజం): శబరిమల అయ్యప్ప సన్నిధానం తాత్కాలికంగా మూతపడింది. 41 రోజుల మండల పూజలు చేసిన తర్వాత.. తీర్థయాత్ర తొలి విడత ముగిసింది. ఆలయాన్ని తిరిగి ఈనెల 30న శనివారం తెరుస్తారు. జనవరి 14న మకర విళక్కు పూజలు నిర్వహిస్తారు. అనంతరం జనవరి 20 న ఆలయాన్ని తిరిగి మూసేస్తారు. ఈ మేరకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మణికంఠుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రధాన అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. కలశాభిషేకం, కలభాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు. ఈ పూజలకు శబరిమల ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కీలక సభ్యులు సైతం హాజరయ్యారు. ఈ పూజతో.. 41రోజుల పాటు సాగే వార్షిక తీర్థయాత్ర సీజన్? తొలి విడత ముగిసింది. మూడురోజుల విరామం అనంతరం ఆలయాన్ని మళ్లీ తెరవనున్నారు. డిసెంబర్ 30న సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని మకరవిళక్కు కార్యక్రమం కోసం తెరుస్తారు. దీంతో తీర్థయాత్ర రెండో విడత ప్రారంభం కానుంది. 2023 జనవరి 14న మకరవిళక్కు పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత జనవరి 20న ఆలయాన్ని మళ్లీ మూసేస్తారు. దీంతో వార్షిక తీర్థయాత్ర సీజన్ ముగుస్తుంది. కాగా.. ఈ 41 రోజుల్లో లక్షల మంది భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ మేరకు కేరళ దేవాదాయ శాఖ మంత్రి రాధాకృష్ణన్ ప్రకటనలో తెలిపారు. మండల పూజల రోజుల్లో ఆలయానికి భారీగా ఆదాయం వచ్చింది. ప్రత్యేక పూజల సమయంలో శబరి గిరులు అయ్యప్ప నామస్మరణతో మారుమోగాయి.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU*,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in